కులవృత్తి కష్టాలు

- దోబీ ఘాట్లు లేక రజకుల ఇక్కట్లు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- 50 సంవత్సరాలకే పింఛన్ ఇవ్వాలని డిమాండ్



వనదుర్గాపురంలో గాడిదలపై గుడ్డలు తీసుకెళ్లుతున్న రజకుల

పాలసముద్రం: రజకుల జీవనం కష్టంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో దోబీ ఘాట్లు లేకపోవడం, నీటి సమస్య తీవ్రం కావడంతో రజకులు ఇబ్బందులు పడుతున్నారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో దాదాపు వెయ్యి కుటుంబాలు కుల వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. దోబీ ఘాట్లు లేక పోవడంతో చెరువులు, వంకలు, కుంటలపై ఆధారపడాల్సి వస్తోంది. వేసవికాలంలో వంకలు, కుంటల్లో నీరు లేక పోవడంతో వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నారు. అయితే అక్కడ కూడా రైతులు అడ్డుకుంటున్నారు. దీంతో రజకులు జీవనం కోసం రెండు, మూడు కిలోమీటర్ల దూరం గుడ్డలను వీపుపై మోసుకుని తీసుకెళ్లాల్సిందే. చెరువు వద్దకు వెళ్లి దుస్తులను శుభ్రం చేసి దుస్తులు ఆరవేసేందుకు స్థలం లేకపోడడం ఇబ్బందిగా మారింది.

సౌకర్యాలు కరువు

ఆయా గ్రామాల్లో రజకులకు ప్రభుత్వంతో పాటు, గ్రామస్తులు ఎలాంటి సౌకర్యాలు కల్పించడంలేదు. కనీసం దోబీ ఘాట్లు ఏర్పాటు చేయలేదు. నీటిసౌకర్యం లేదు. కుల వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది

అందని ప్రభుత్వ సాయం

గతంలో తమకు ప్రభుత్వం నుంచి ఇస్త్రీ పెట్టెలు, ఇతర పనిముట్లు పంపిణీ చేశారని ప్రస్తుతం ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని రజకులు విమర్శిస్తున్నారు. పైగా బ్యాంకు రుణాల మంజూరులోనూ జన్మభూమి కమిటీల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బ్యాంకు రుణాలతోపాటు దోబీఘాట్లు నిర్మించాలని కోరుతున్నారు.




శ్రీకావేరిరాజుపురంలో ఇంటింటికి తిరిగి గుడ్డలు తీసుకొస్తున్న సుగుణమ్మ, దోబీ ఘాట్లు లేక చెరువులో ఉతుకుతున్న రజకులు

ఘాట్లు ఏర్పాటు చేయాలి



గ్రామాల్లో ఘాట్లు లేవు. దీంతో కులవృత్తిపై ఆధారపడి జీవించే మాలాంటి వారు ఇబ్బందులు పడుతున్నాం. గ్రామం సమీపంలోని కాలువ నీటిపై ఆధారపడి కులవృత్తి కొనసాగిస్తున్నాం. ఎండాకాలంలో నీటి ప్రవాహం ఉండదు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం.

– రఘుపతి, శ్రీకావేరిరాజుపురం, రజకుడు

పింఛన్ మంజూరు చేయాలి



ప్రతి రోజూ గుడ్డలను తీసుకెళ్లి ఉతికి, అందులో వచ్చిన నగదుతో జీవనం చేస్తున్నాం. 50 వయస్సు అయిపోతే నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నాం. అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం రజకుల కష్టాలను తెలుసుకుని, 50 సంత్సరాలకు పింఛన్ మంజూరు చేయాలి. లేకుంటే తిండికి కూడా కష్టాలు తప్పవు.

– బాషా, శ్రీకావేరిరాజుపురం, రజకుడు

సమస్యలను పరిష్కరించాలి



వేసవిలో చాలా గ్రామాల్లో పూర్తి స్థాయిలో నీరుండదు. వర్షాకాలంలో సైతం చెరువుల కింద చిన్న చిన్న కాలువల్లో పారే నీటిలో బట్టలు ఉతకాల్సి వస్తోంది. నీరు ఉండేచోట్లకు రెండు కిలో మీటర్లు వెళ్లాలి. ప్రభుత్వం స్పందించి బోర్లు, ధోబీ ఘాట్లు ఏర్పాటు చేసి రజకుల సమస్యలను పరిష్కరించాలి.

– లక్ష్మణన్, శ్రీకావేరిరాజుపురం

రజకుల సమస్యలు మా దృష్టికి రాలేదు



నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్లు రజకులు మా దృష్టికి తీసుకురాలేదు. రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే బీసీ కార్పొరేషన్ ద్వారా వారికి లోన్ సౌకర్యం ఏర్పాటు చేస్తాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బోర్లు, దోబీ ఘాట్లు ఏర్పాటుకు సహాయం అందించి, తగిన న్యాయం చేయడానికి ప్రయత్నిస్తాం.

– రామనాథరెడ్డి, ఎంపీటీసీ

పారిశుధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రమౌళి

విజయపురం: గ్రామాల్లో పారిశుధ్యం, రక్షిత తాగునీటి సరఫరాపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, సర్పంచ్ ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీవో చంద్రమౌళి అన్నారు. సోమవారం తన కార్యాలయంలో గ్రామీణాభివృద్ధిపై నిర్వహించిన మూడు రోజుల శిక్షణ సమావేశంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్న కారణంగా వ్యర్థ పదార్థాలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు గ్రామాల్లో పారిశుధ్య పనులు, కాలువల్లో మురుగునీరు నిలిచి పోకుండా చూడాలన్నారు. గ్రామీణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, సమస్యలను గుర్తించి పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. గ్రామాల్లో జ్వరాలు, విరేచనాలు వ్యాపించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. అవసరమైతే గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడమే కాకుండా వెంటనే పైఅధికారులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సురేంద్రకుమార్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బోధన సామగ్రి పంపిణీ

విజయపురం: ఇష్టకామేశ్వరపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ హెచ్ఎం చంద్రయ్య సోమవారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. హెచ్ఎం ఉదయమ్మ చేతుల మీదుగా నోటుపుస్తకాలు అందించారు. ప్రభుత్వ పాఠశాలలో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని, ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వం పాఠశాలల్లోనే చేర్చాలని దాత చంద్రయ్య కోరారు.

క్లుప్తంగా

సింగిల్ విండో డిజిటలైజేషన్‌కు సహకరించండి

గంగాధరనెల్లూరు: సింగిల్ విండో డిజిటలైజేషన్‌కు మండల రైతులు సహకరించాలని డీసీసీబీ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ మహేష్, సీఈఓ విజయ్‌కుమార్‌రెడ్డి కోరారు. అక్టోబర్ 2వ తేదీలోపు భూమి పాస్‌బుక్ , ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్, రేషన్ కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను సింగిల్ విండో కార్యాలయంలో అందజేయాలని కోరారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

గంగాధరనెల్లూరు: గ్రామ పంచాయతీలలో మౌలిక సదుపాయాల కల్పనే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో రాఘవేంద్ర రాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులకు పంచాయతీ కార్యదర్శులకు సోమవారం మూడో విడత శిక్షణా తరగతులు నిర్వహించారు. సర్పంచులు పంచాయతీ కార్యదర్శుల విధులు, బాధ్యతలపై శిక్షణనిచ్చారు. గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పన, పారిశుధ్య నిర్వహణ, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. శివయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఈవోపీఆర్డీగా సురేంద్రకుమార్



విజయపురం: ఈవోపీఆర్డీగా పంచాయతీ కార్యదర్శి ఎంఎస్ సురేంద్రకుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇతను విజయపురం పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్నాడు. చిత్తూరు జిల్లా డీపీవో ఉత్తర్వుల మేరకు సోమవారం ఈవోపీఆర్డీ బాధ్యతలు చేపట్టారు. గ్రామాభివృద్ధి, పారిశుధ్య మెరుగుపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానన్నారు. అనంతరం సచివాలయ సిబ్బంది శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

పంచాయతీ కారదర్శికి సన్మానం



ఉత్తమ కార్యదర్శిని సన్మానిస్తున్న అధికారులు

విజయపురం: ఉత్తమ కార్యదర్శి అవార్డు అందుకున్న బూచివానత్తం పంచాయతీ కారదర్శి సంపూర్ణను సోమవారం తోటి సిబ్బంది, సర్పంచ్‌లు దుశ్శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. అలాగే ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బందితో పాటు రాజకీయ నాయకులు సత్కరించి, అభినందించారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ డే



దాగుర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

నగరి: 185వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని స్థానిక ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు ఘనంగా నిర్వహించారు. సోమవారం అసోసియేషన్ కార్యాలయం వద్ద ఫొటోగ్రఫీ పితామహుడు దాగుర చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఫొటోగ్రఫీ రంగంలో ఆయన చూపిన నైపుణ్యాన్ని గుర్తు చేసుకున్నారు. సభ్యులకు స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ అన్నాదురై, వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్, సెక్రటరీ రవీంద్రబాబు, జాయింట్ సెక్రటరీ శివకుమార్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం

శ్రీరంగరాజపురం: సర్పంచులు తమ పంచాయతీల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని ఎంపీడీఓ మోహన్‌మురళి అన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ కార్యాచరణ ప్రణాళిక 2024–2025 సంబంధించి సోమవారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు మండల కేంద్రంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, ఎల్ఈడీ వీధి లైట్ల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. శిక్షకులుగా రమేష్, బాబు వ్యవహరించారు.

ఎస్ఐగా వెంకటసుబ్బయ్య

వెదురుకుప్పం: ఎస్ఐగా వెంకటసుబ్బయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన శేషగిరి తిరిగి ఆయన పూర్వ స్థానానికి బదిలీ కావడంతో ఖాళీ అయ్యింది. దీంతో తిరుపతి జిల్లా తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేసిన వెంకటసుబ్బయ్య విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించ వద్దని తెలిపారు.

ముగిసిన తెప్పోత్సవాలు



తెప్పపై విహరిస్తున్న శ్రీవేణుగోపాల స్వామి

కార్వేటినగరం: టీటీడీ అనుబంధంగా ఉన్న రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి తెప్పోత్సవ వేడుకలు మూడవ రోజు సోమవారం వైభవంగా ముగిశాయి. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్కంధ పుష్కరిణిలో ఏర్పాటు చేసిన తెప్పపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ క్రమంలో భాగంగా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధ్యక్షుడు సురేష్‌కుమార్, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కుంభాభిషేక మహోత్సవం



అమ్మవారి సేవలో భక్తులు

శ్రీరంగరాజపురం: మండలంలోని సింధురాజపురంలో 200 ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీకరకమాణి గంగమ్మ నూతన ఆలయానికి గ్రామస్తులు సోమవారం ఘనంగా కుంభాభిషేకం నిర్వహించారు. వేఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పందిరిలో గణపతి పూజ, పూర్ణాహుతి, హోమం పూజలు చేశారు. సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ అమ్మవారి ప్రతిమను వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా ప్రాణప్రతిష్ఠ చేశారు. తదుపరి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పుష్ప పల్లకిపై వేంచేపు చేసి వివిధ రకాల పుష్పాలు, పట్టు పీతాంబరాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య అమ్మవారిని ఊరేగించారు. గ్రామస్తులు మహిళలు పెద్ద ఎత్తున మంగళ హారతులు సమర్పించారు. కొబ్బరి కాయలను కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో మహిళలు పొంగళ్లు పెట్టి ప్రసాదాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయంలో రుత్వికులు పెద్ద ఎత్తున పూజలు చేయడంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. భక్తులకు నిర్వాహకులు చల్లం పాపయ్య, కుమార్ కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆలయ చైర్మన్ బాలాజినాయుడు, గ్రామ పెద్దలు ప్రకాష్, చెంచు యాదవ్, రాజేంద్ర, చిరంజీవి, సుధాకర్, సుబ్రహ్మణ్యం, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మంచినీళ్ల గుంట స్థలాలు కబ్జా



మంచినీళ్ల గుంటను సర్వే చేస్తున్న అధికారులు

విజయపురం: మండల రెవెన్యూ, ఎంపీడీవో కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న మిట్టూరు మంచినీళ్ల గుంట కబ్జాకు గురైంది. 2.36 ఎకరాలు ఉన్న గుంట రాను రాను కుదించుకొని పోయింది. దీన్ని గమనించిన గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు సర్వే చేయగా ఇందులో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. గుంట చుట్టూ ఉన్న రైతులు మంచి నీళ్ల గుంట స్థలాన్ని ఆక్రమించుకున్నట్లు అధికారులు గుర్తించారు. అదే గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇంటికి సైతం గుంట స్థలం ఆక్రమించుకున్నట్లు వెల్లడైంది. అయితే అధికారులు వారికి నోటీసులు ఇవ్వకపోవడంపై గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. 20 మందికి పైగా అధికారులు వచ్చి ఒక రోజంతా సర్వే చేసి అక్రమాలను గుర్తిస్తే, వాటిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల తీరు చూస్తుంటే అనుమానం కలుగుతోందని, జిల్లా అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

దోమలను అరికట్టాలి



బీసీ బాలికల హాస్టల్ పరిసరాల్లో మలాథియాన్ పిచికారీ

పాలసముద్రం: వ్యాధుల నుండి రక్షించుకోవాలంటే ఇంటి పరిసర ప్రాంతాల్లో దోమలు, లార్వా వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. సోమవారం పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సుశీల, మురళి ఆధ్వర్యంలో ప్రభుత్వ వసతి గృహాలకు వెళ్లి దోమలు, లార్వా వృద్ధి చెందకుండా మలాథియాన్ పిచికారీ కార్యక్రమం చేపట్టారు. సూపర్‌వైజర్ మురళి మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులు భోజనం చేయక ముందే చేతులను సబ్బుతో కడగాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంటే జ్వరం, దగ్గు, జలుబు వంటి వాటిని అరికట్టవచ్చని తెలిపారు. అనంతరం హాస్టల్ పరిసరాల్లో మలాథియాన్ మందు పిచికారీ చేశారు.

22న చంద్రమౌళీశ్వరాలయ కుంభాభిషేకం

నగరి: కీళపట్టులోని త్రిపుర సుందరి సమేత చంద్రమౌళీశ్వర ఆలయ అష్టబంధన మహాకుంభాభిషేక వేడుకలు ఈ నెల 22న నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకుడు సుబ్రమణ్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి శ్రీఓం పంచశక్తి పీఠ స్థాపకులు దేవియమ్మ, పీఠాధిపతి జ్ఞానశక్తియేంద్ర స్వామి విచ్చేస్తారని పేర్కొన్నారు.

కొండమల్లీశునికి ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం: డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఘనంగా పూజలు నిర్వహించారు. వేకువ జామునే సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పాలు, పెరుగు, కుంకుమతో అభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. చవటగుంటలో ఉన్న మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వర స్వామి ఆలయంలో కూడా ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు.

ఉత్తమ ఎంఈవోగా విజయకుమార్



సన్మానం అందుకుంటున్న ఎంఈవో విజయకుమార్

కార్వేటినగరం: ఉత్తమ ఎంఈవోగా కార్వేటినగరం ఎంఈవో విజయకుమార్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విజయకుమార్‌ను సోమవారం మండలంలోని ప్రధానోపాధ్యాయులు, టీచర్లు ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ ఎంఈవో విజయకుమార్ మండలంలో విద్యా ప్రమాణాలు మెరుగు పడేందుకు ఎంతో కృషి చేశారన్నారు. ఎంఈవో–2 మనోజ్ కుమార్, హెచ్ఎం కేశవులు, డైట్ అధ్యాపకులు చెంగల్‌రాజు, పీడీ మాండవ్య, రాబర్ట్, కార్తికేయన్, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ సమావేశాలకు తరలిరండి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ కార్యదర్శి ఓబులేసు

నగరి: ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలను జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా సమితి సమావేశం నియోజకవర్గ కార్యదర్శి దాసరి చంద్ర అధ్యక్షతన నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1, 2, 3 తేదీలలో విశాఖ పట్నం మహానగరంలో జరిగే జాతీయ సమ్మేళనాలను విజయవంతం చేయాలన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ నాయకులు నాగ సుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ప్రభావతి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చందామర్రై, వర్కింగ్ ప్రెసిడెంట్ రమాదేవి, స్కూల్ ఆయమ్మల జిల్లా కార్యదర్శి జయకుమారి, గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి గోవిందస్వామి, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు నగోమి, శాంతి, రమాదేవి మంజుల, సంగీత కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక నగదు పంపిణీ



విద్యార్థిని లక్ష్మీసుధ తండ్రికి నగదు అందజేస్తున్న సెల్‌కాన్ ఎండీ గురుస్వామినాయుడు

గంగాధరనెల్లూరు: పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించే తూగుండ్రం విద్యార్థులకు ప్రతి సంవత్సరం తోడ్పాటు అందిస్తానని సెల్‌కాన్ కంపెనీ ఎండీ గురుస్వామి నాయుడు అన్నారు. ఆయన విద్యాభ్యాసం చేసిన గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రం హైస్కూల్లో సోమవారం పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. సెల్‌కాన్ ఎండీ సతీమణి హేమావతి, సోదరుడు కృష్ణమనాయుడు, చిత్తూరు బాలాజీ మొబైల్స్ యజమాని వెంకటేష్ నాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొదటి బహుమతి కింద లక్ష్మీసుధకు రూ.25 వేలు, రెండవ బహుమతి తేజస్వినికి రూ.15 వేలు, మూడో బహుమతి కింద రూ.10 వేలు నగదు బహుమతులను అందజేశారు. ఇన్‌చార్జి హెచ్ఎం రాజేంద్ర నాయుడు, ఎస్.ఆర్.పేట హైస్కూల్ హెచ్ఎం రమేష్, స్కూల్ కమిటీ చైర్మన్ సుధాకర్ శెట్టి, నేతలు నియాజ్ అలీ, నీరజాక్షులు రెడ్డి, జీవరత్నం, శాంతకుమార్, కండ్రిగ శంకర్, సంపత్, రాఘవేంద్ర, దాసరపల్లె శంకర్, టీచర్లు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

భూసార పరీక్ష పంటలకు శ్రీరామరక్ష



మట్టిని వేరు చేసే విధానాన్ని చూపిస్తున్న ఏఓ ఢిల్లీప్రసాద్

పాలసముద్రం: రైతులు పంట సాగు చేసే ముందు భూసారం తెలుసుకోవడానికి మట్టి పరీక్ష చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ తెలిపారు. సోమవారం చెరువుముందర కండ్రిగ గ్రామంలో రైతులకు భూసార పరీక్ష చేయడంతో వచ్చే లాభాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులతో ఏఓ ఢిల్లీప్రసాద్ మాట్లాడుతూ పంట సాగు చేసే ముందు ప్రతి రైతు భూసార పరీక్షలపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. పంట కోతలు ముగిసిన నెల రోజులకు మట్టి నమూనా సేకరించాలని తెలిపారు. భూసార పరీక్ష చేసుకుంటే ఏ పంట పండించాలో తెలుస్తుందన్నారు. అప్పుడే అధిక దిగుబడులు వస్తాయన్నారు. రసాయన ఎరువులు అధికంగా వాడడంతో భూమిలో సారం తగ్గి పంట దిగుబడి తగ్గిపోతుందన్నారు. అనంతరం రైతులకు మట్టిని వేరు చేసే విధానాన్ని చార్టులో బొమ్మ వేసి వివరించారు. కార్యక్రమంలో రైతు భరోసా వ్యవసాయ సహాయకులు వనజ, రైతులు పాల్గొన్నారు.

ఆధునికతతో అధిక లాభాలు

- గొర్రెల పెంపకంలో యాజమాన్య పద్ధతులు పాటించాలి
- ఆరోగ్య రక్షణపై అవగాహన అవసరం



గొర్రెల మంద

విజయపురం: గొర్రెల పెంపకంలో ఆధునిక జాగ్రత్తలు పాటిస్తే అధిక లాభాలు ఆర్జించవచ్చని పశు వైద్యాధికారులు చెబుతున్నారు. పలువురు సన్న, చిన్నకారు రైతులు వ్యవసాయ కూలీలు గొర్రెలను అధిక సంఖ్యలో పెంచుతున్నారు. అయితే.. వీటి పోషణలో తగు జాగ్రత్తలు పాటించకపోవడంతో ప్రతి ఏడాది 20 శాతం వరకు గొర్రెలను కోల్పోతున్నారు. దీంతో పలువురు గొర్రెల పెంపకందారులు లాభాలు బదులు నష్టాలను చవిచూస్తున్నారు. గొర్రెల పోషణలో ఆధునిక యాజమాన్య పద్ధతులు, ఆరోగ్య రక్షణపై సరైన అవగాహన పెంచుకుంటే లాభాలు ఆర్జించవచ్చు.

రైతులు ఆన్‌లైన్‌లో ధ్రువీకరించుకోవాలి

కిసాన్ సేవా పథకం ద్వారా రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా సేవలను వారే సొంతంగా నెట్ ద్వారా చూసుకునే వీలుంది. ఇందు కోసం ప్రభుత్వం వెబ్‌సైట్ ప్రవేశపెట్టింది. అర్హులచ్చ జ్ఞుట వెబ్సైట్ ద్వారా మీసేవ కేంద్రాలు, ఇంటర్నెట్ సెంటర్ల ద్వారా వివరాలను నమోదు చేసుకోవచ్చు.

నెట్లో పొందుపర్చితే లాభాలు

- ప్రభుత్వం నుంచి లభించే రాయితీలు, సబ్సిడీలను నేరుగా తెలుసుకోవచ్చు
- బ్యాంకు లావాదేవీలను చూసుకోవచ్చు
- ఐడీ కార్డు పొందవచ్చు
- ఎరువులు అందుబాటులో ఉండే దుకాణాల వివరాలు, ధరలను తెలుసుకోవచ్చు
- యాంత్రీకరణ పద్ధతులపై అవగాహన ఉంటుంది
- వాహనాలు, పనిముట్లు, సబ్సిడీపై పంపిణీ అయ్యే వివరాలను తెలుసుకోవచ్చు
- ప్రకృతిరీత్యా జరిగే పంటనష్టం వివరాలు
- పంటనష్టం వివరాలు పొందుపర్చవచ్చు.
- వివిధ రకాల నూతన వంగడాల వివరాలు తెలుసుకోవచ్చు.
- రైతులకు కావాల్సిన వివరాలు ఉంటాయి

పెంపకంలో జాగ్రత్తలు

- గొర్రెల పాకలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. గాలి వెలుతురు వచ్చేలా వాటిని ఎత్తైన ప్రదేశాల్లో నిర్మించుకోవాలి. అలాగే తడి లేకుండా చూసుకోవాలి.
- గొర్రెలకు అమ్మతల్లి, పీపీఆర్ వంటి రోగాల నివారణకు టీకాలు వేయించాలి.
- క్రమం తప్పకుండా 60 నుంచి 90 రోజులకోసారి నట్టల నివారణ మందులు తాగించాలి. ఈ మందులను పశువైద్యుల సలహా మేరకు అందించాలి.
- గొర్రెల పోషణలో సరైన జాగ్రత్తలు పాటించాలి. లేని పక్షంలో గొర్రె పిల్లలు వందకు 20 వరకు మృతి చెందుతాయి. వీటిని అరికట్టాలి. గొర్రె పిల్లలకు పుట్టిన మూడో రోజు జున్ను పాలు తాగించాలి. పశు వైద్యుల సలహా మేరకు రోగ నిరోధక మందులను నోటి ద్వారా అందించాలి.
- గొర్రెలకు పరిశుభ్రమైన నీటి ప్రవాహాల వద్దనే నీటిని తాగించాలి.
- గొర్రెల మందలో విత్తనపు పొట్టేళ్లను ప్రతి రెండు సంవత్సరాలకోసారి మార్చుకోవాలి.
- మందలో వచ్చే వ్యాధులను అప్రమత్తంగా ఉంటూ గమనించాలి. వ్యాధి లక్షణాలు ఉన్న గొర్రెలను మంద నుంచి వేరు చేసి సరైన చికిత్స అందించాలి.
- దోమలు, ఈగలతో కొన్ని వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. వీటి నివారణకు వర్షా కాలం, శీతాకాలంలో గొర్రెల మందలో వేపాకు పొగ వేసుకోవాల్సి ఉంటుంది.
- వేసవి కాలంలో ఎండ వేడిమి ఎక్కువగా ఉంటుంది. జీవాలు వేడికి ఇబ్బంది పడకుండా వాటిని నీడలో ఉంచేలా పాకలను ఏర్పాటు చేయాలి. జీవాలను ఎక్కువసేపు ఎండలో ఉంచితే రోగాలు వస్తాయి.
- క్రిమిసంహారక మందులు చల్లిన పొలాల్లో మేపకూడదు. గొర్రెల పెంపకంలో జాగ్రత్తలు పాటిస్తే గొర్రెల మరణాలు తగ్గించి అధిక లాభాలు పొందవచ్చు.

దున్ని.. విత్తనాలు చల్లేశారు



కృష్ణారామాపురంలో ఏపుగా పెరిగిన సజ్జ

- ఎరువులు లేవు, మందులు లేవు
- ఏపుగా పెరిగిన సజ్జ పంట

నగరి: పొలం దున్ని విత్తనాలు చల్లి వదిలేశారు. ఆపై ఏ విధమైన వ్యవసాయ పనులు చేపట్టలేదు. సజ్జపంట ఏపుగా పెరిగింది. దిగుబడి కూడా ఎక్కువ వస్తుందని రైతులు చెబుతున్నారు. ఇలా నగరి మండలంలో 100 ఎకరాల్లో సజ్జ పంట సాగైంది. వివరాల్లోకి వెళితే నగరి మండలంలో సేంద్రీయ పద్ధతిలో పంటలు సాగు చేసే రైతులు 100 ఎకరాల్లో పచ్చిరొట్ట వేశారు. ఆ పంటను అలాగే భూమిలో తొక్కించేసి దున్నేశారు. ఆపై విత్తనాలు చల్లి వదిలేశారు. ఎరువులు వాడలేదు, పురుగుల మందులు వాడలేదు. కలుపు తీయలేదు. రెండు మూడు సార్లు పెద్ద ఎత్తున వర్షాలు పడి నీరు నిల్వ చేరడం, ఆపై అప్పుడప్పుడూ వర్షాలు పడడంతో ఈ పంటలకు నీరు కూడా పారించలేదు. భూమిలో ఉన్న సారాన్ని వర్షం ద్వారా అందిన నీటితోనే సజ్జ పంట ఏపుగా పెరిగింది. త్వరలో కోతలు కోస్తామని, దిగుబడి కూడా బాగా వస్తుందని రైతులు చెబుతున్నారు. సేంద్రీయ వ్యవసాయం ద్వారా భూములు సారవంతంగా మారడమే పంట ఇలా రావడానికి కారణమని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ చంద్రశేఖర్ తెలిపారు.